డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

గచ్చిబౌలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అంజుమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అధ్యాపకులు కావాలని, సంబంధిత సబ్జెక్ట్‌లో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, ఇతరులు 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


సంజయ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

షాపూర్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్‌లోని పలుబస్తీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారితో కలిసి సమీక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపించడంతో డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ అధికారితో కలిసి సమస్యలను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని పారిశుధ్య కార్మికుడికి గాయాలు

జీడిమెట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వచ్చిన కారు విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికుడిని శుక్రవారం తెల్లవారుజామున ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. వివరాల్లోకి వెళితే.. ఓల్డ్ అల్వాల్‌కు చెందిన టి.శాంతారావు(39) జీహెచ్‌ఎంసీ గాజులరామారం సర్కిల్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 5.45 నిమిషాల సమయంలో ఐడీపీఎల్ చౌరస్తా సాయినగర్ సమీపంలోని చెత్తను సేకరించే పనిలో ఉన్నాడు. నాగాంజనేయ అతివేగంగా కారు నడుపుతూ శాంతారావును ఢీకొట్టాడు. దీంతో అతడి రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కారు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. తోటికార్మికులు శాంతారావును ఆసుపత్రికి తరలించారు. క్యాబ్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన శాంతారావు

హై ఓల్టేజీతో కాలిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు

గాజులరామారం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ హై ఓల్టేజీ కారణంగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. అయినా అధికారులు స్పందించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సమస్యను తీర్చకపోవడంతో కాలనీవాసులు విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని చంద్రగిరినగర్‌లో ఒక్కసారిగా హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్‌లు, టీవీలు, బల్బులు కాలిపోయాయి. ఈ సమస్యను స్థానికులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు ఫోన్‌లు చేసి సమస్యను వివరించినా పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచాలి

షాపూర్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సకాలంలో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. షాపూర్‌నగర్, గాజులరామారం నుంచి కేపీహెచ్‌బీ కాలనీకి వెళ్లే ప్రయాణికులకు సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులపై బయటకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపూర్‌నగర్, రోడామేస్త్రీనగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీ, ఇందిరానగర్, హెచ్‌ఏఎల్‌కాలనీ, ఉషోదయకాలనీ, గాజులరామారం, దేవేందర్‌నగర్, కైసర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కూకట్‌పల్లికి విద్యార్థులు, ఉద్యోగులు అధికంగా ప్రయాణిస్తుంటారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఒక బస్సును నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీస్‌లను పెంచాలని పలువురు ప్రయాణికులు జీడిమెట్ల డిపో మేనేజర్‌ను కోరుతున్నారు.


షాపూర్‌నగర్ బస్టాప్‌వద్ద వేచిఉన్న ప్రయాణికులు


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌బస్టాపులోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సహస్రనామార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన, కల్పవృక్ష వాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ మండపంలో పి.లావణ్య వాగ్దేవి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతామణి నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకొన్నాయి.

ఎల్లమ్మచెరువు వద్ద పైపులైను పనుల పరిశీలన

హైదర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మచెరువు సర్‌ప్లస్ నాలా వద్ద జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి, శుభోదయ ప్రాంతాల్లో రోడ్డు మీద నిలుస్తున్న వరదనీరు ప్రస్తుతం వేస్తున్న పైపులైన్ ద్వారా ఎల్లమ్మచెరువు సర్‌ప్లస్ నాలాలో కలిసేటట్లుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, పోశెట్టిగౌడ్, నజీర్, మోజెస్ పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న వెంకటేష్‌గౌడ్

యువకుడు అదృశ్యం

పేట్‌బషీరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్నేహితుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు తిరిగి ఇంటికి రాలేదు. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల వెన్నెలగడ్డకు చెందిన బండారు స్వామి(26) ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 27న ఉదయం స్నేహితుల ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కానీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో స్వామి తల్లి బండారు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్వామి

విజయ్‌కుమార్ మృతిపట్ల సీఆర్ ఫౌండేషన్ సంతాపం

మియాపూర్: సీఆర్ ఫౌండేషన్ జనరల్ బాడీ సభ్యుడు నీలం విజయ్‌కుమార్ మృతిపట్ల సీఆర్‌ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ తీవ్రసంతాపం తెలియజేసింది. సామాజిక సేవ కార్యకలాపాలలో సమాజ అభ్యున్నతికి ఆయన కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఆర్‌ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు సంతాపం తెలిపారు.

పేదలపై ప్రతాపం.. పెద్దలకు రాచమర్యాదలా?

- మీ ఆరాటమంతా డబ్బు కోసమేనా?
- టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): 'పేదలు రోడ్ల వెంట వ్యాపారాలు చేసుకుంటే వెంటాడి వేధిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం.. అనుమతుల్లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తుంటే అవి మీకు ఎందుకు కనిస్తలేవు' అని టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో రమ్యగ్రౌండ్ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే వాటి పరిష్కారం ఎప్పటిలోగా చూపుతారో చెప్పాలని అధికారులను ఆదేశించారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క కొత్త వర్క్ చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. గతంలో పిలిచిన టెండర్ల పనుల సంగతేంటని ప్రశ్నించారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడొద్దని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

● గేమ్స్ ఇన్‌స్పెక్టర్‌పై అసహనం

సమీక్షా సమావేశానికి హాజరుకావాలని ముందస్తుగా సమాచారం పంపినా కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. గేమ్స్ ఇన్‌స్పెక్టర్ వీరానందం సమావేశానికి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. క్రీడల కోసం నిధుల మంజూరు, సామగ్రి పంపిణీపై క్రీడాకారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా సదరు అధికారి సమాధానం చెప్పడం లేదన్నారు. సమావేశానికి ఎందుకు హాజరు కాలేదో గేమ్స్ ఇన్‌స్పెక్టర్ తనను కలిసి వివరించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో ఇదే విషయాన్ని ఆయన పీఏ సదరు అధికారికి సమాచారం అందించినట్లు తెలిసింది.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

● అక్రమ నిర్మాణాలను అడ్డుకోరా?

పదేళ్లుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారుల అడ్డాలను తొలగించిన అధికారులు.. వసంతనగర్‌లో పదికి పైగా ఆరు, ఏడు అంతస్తు నిర్మాణాలు చేస్తున్నా ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని టౌన్ ప్లానింగ్ ఏసీపీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కాలనీ అధ్యక్షుడు యర్రా నాగేశ్వరరావు తమ కాలనీలో అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌లను అడ్డుకోవాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోరా? అని ప్రశ్నించారు. 'మీకు డబ్బులు ఇచ్చే వారికి రాచమర్యాదలు చేస్తారా? డబ్బులు ఇచ్చుకోలేని పేదలపై ప్రతాపం చూపిస్తారా' అంటూ డీసీని ప్రశ్నించారు. కిందిస్థాయి సిబ్బందిపై ఆరోపణలు వెలువెత్తుతున్న నేపథ్యంలో కేపీహెచ్‌బీ వసంతనగర్‌లోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించడంతో చేసేది లేక సరే అంటూ ఏసీపీ సమాధానం ఇచ్చారు. పెద్దల ఆక్రమణలు, అనుమతుల్లేని నిర్మాణాలపై తీసుకుంటున్న చర్యలు ఏంటో తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీంతో భవన నిర్మాణదారుల్లో అలజడి నెలకొంది.

గడువుతీరిన మందుల పంపిణీ

గచ్చిబౌలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్లలోపు పిల్లలకు గడువుతీరిన నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారని ఆరోపణలు వస్తున్నాయి. మండలం పరిధిలో ఈ నెల 20 నుంచి నులిపురుగుల నివారణ కోసం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశా రు. ఐతే మాదాపూర్, కొండాపూర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో డిసెంబర్ 2023 గడువు ఉండగా ఆ మందులనే పంపిణీ చేయడంతో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ఆందోళనకు గురయ్యారు. వెంటనే పాఠశాల హెచ్‌ఎం అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వాటిని పిల్లలకు పంపిణీ చేయొద్దని సలహా ఇచ్చినట్లు తెలిసింది. గడువు తీరిన మాత్రలు సరఫరా చేయడం ఏమిటని, అధికారుల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గడువు ముగిసిన మాత్రలు

ఆ ఆరోపణలు అవాస్తవం

నులిపురుగుల నివారణ కోసం పంపిణీ చేస్తున్న ఆల్‌బెండజోల్ గడువు తీరిన మాత్రలు సరఫరా చేసినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవం. గతేడాది సరఫరా చేసిన ట్యాబ్లెట్లను కొంత మంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

\- చంద్రనాయక్, మండల వైద్యాధికారి

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి

కూకట్‌పల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ప్రాంతంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేపీహెచ్‌బీకాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, రజిత, సంజీవరావు, మేకల మైఖేల్, రేష్మ, అరవింద్‌రెడ్డి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వివేకానందనగర్ డివిజన్ సప్తగిరికాలనీలో నిర్వహించిన పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవరం రంగారావు, శ్రీనివాస్‌యాదవ్, శర్మ, కాశీనాధ్, పోతుల రాజేందర్, చంద్రమోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, నాయకులు

సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సు ప్రారంభించనట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నెంబర్ 90/253టి నెంబర్‌తో బస్‌సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రోస్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పనిచేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

10 మందికి రిమాండ్

అల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్‌లో ఇటీవల జరిగిన హత్య మిస్టరీని పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. హతుడు యహ్యా డానిష్(17), నిందితుల్లో ఒకడైన మైనర్ ఒకే అమ్మాయితో సన్నిహితంగా ఉండటమే ఈ హత్యకు కారణమని, పక్కా పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్న డానిష్ గత శనివారం రాత్రి స్నేహితులు పిలిచారంటూ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి స్నేహితులు జహీర్, ఆమెర్, షోయబ్, రేహాన్‌లతో కలిసిన మైనర్ నిందితుడు.. డానిష్‌ను బీరు బాటిళ్లతో కొట్టి, శరీరంలో పొడిచారు. అనంతరం డానిష్‌ది ఆత్మహత్యగా చిత్రీకరించే క్రమంలో బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై వదిలేశారు. ట్రాక్‌పై నుంచి రైలు వెళ్లిన కారణంగా డానిష్ శరీరం ఛిద్రమయింది. డానిష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల విచారణానంతరం కేసు కొలిక్కి వచ్చింది. అయితే నిందితులు 10 మందిలో ఐదుగురు మైనర్లు ఉండటం గమనార్హం. శుక్రవారం వారందరినీ రిమాండుకు తరలించినట్టు సమాచారం.

ఇళ్ల రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని వినతి

పేట్‌బషీరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో సామాజిక కార్యకర్త కె.రవీందర్ ముదిరాజ్, బౌరంపేట కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు బుచ్చిరెడ్డి, కిషన్‌రావులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గల ఐదు శివారు గ్రామాలు నేటికి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇక్కడ నివశిస్తున్న వారి పేరున ఇళ్లు, ఇళ్ల స్థలాలు నేటికి వారి పేర్ల మీదకి మారలేదన్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ, పురపాలక సంఘాలు కార్పొరేషన్‌లో ఎలాంటి అనుమతులు ఇవ్వడంలేదని వాపోయారు. ఉన్న భూమిలో కొంత స్థలాన్ని విక్రయించి, ఇండ్లు నిర్మించుకుంటే జీహెచ్‌ఎంసీ వారు 100 శాతం ఇంటి పన్ను వేస్తున్నారని, ఇళ్లు, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని సంబంధిత అధికారులతో చర్చించి, శివారు ప్రాంతాల వారికి మేలు చెయ్యాలని ఎమ్మెల్యేను కోరారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆటస్థలాలు, పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్ ఎస్‌ఆర్‌నాయక్‌నగర్‌లో నిర్మిస్తున్న ఇండోర్‌స్టేడియం పనులను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని రమణ, టీటీకే శ్రీనివాసరావు, గుబ్బల లక్ష్మీనారాయణ, దూదిమెట్ల సోమేష్, మల్లిఖార్జునరావు, శేషాచారి పాల్గొన్నారు.

విగ్రహాల ముసుగు తొలగేనా?

ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంతగ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దంన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.


ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తున్న మేయర్ విజయలక్ష్మి

మోదీ.. మద్దతు ధరలపై చట్టం చెయ్.!

- రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి
- లేదంటే పోరాటం ఉధృతం: సంయుక్త కిసాన్ మోర్చా

పంజాగుట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రచారం చేస్తామని హెచ్చరించింది. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంఏర్పాటు చేశారు. మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దల్లెవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చెంగల్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలతో పాటు ఎన్డీఏలోని బీజేపీయేతర ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రైవేటు బిల్లు పెట్టాలని కోరుతామని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని, వర్షాకాల పార్లమెంటు సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతించారు. సాగు చట్టాలపై నిరసనల సందర్భంగా రైతులపై ప్రయోగించిన తూటాలు, బాష్పవాయు గోళాలను సమావేశంలో ప్రదర్శించారు. అభిమన్యు కోహర్, లక్వీందర్ సింగ్ (హరియాణ), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్‌సింగ్ (యూపీ), జాఫర్‌ఖాన్, సుఖ్‌జిత్‌సింగ్ (ఢిల్లీ), గోవిందరెడ్డి (కర్ణాటక) తదితరులు పాల్గొన్నారు.


రైతులపై ప్రయోగించిన తూటాలు, బాష్పవాయు గోళాలు, రాకెట్ బాంబులను చూపుతున్న కిసాన్ మోర్చా నాయకులు

క్యాచ్‌పిట్ల వద్ద చెత్తా చెదారం తొలగించండి!

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరద నీటి ప్రవాహం సాఫీ గా వెళ్లేలా క్యాచ్‌పిట్ల వద్ద చెత్తాచెదారం తొలగించాలని ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాదాపూర్‌లో అకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రేటర్‌లోని 140 ప్రాంతాల్లో వరద నీరు నిలుస్తుందని గుర్తించిన నేపథ్యంలో ఆ ఏరియాల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ఏం చేయాలన్నది పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో క్యాచ్‌పిట్ల వద్ద చెత్తా చెదారం ఉండడాన్ని గమనించిన ఆయన వెంటనే తొలగించాలన్నారు.


నాలాలను పరిశీలిస్తునన రంగనాథ్

ఆర్పీఎఫ్ బ్యాడ్మింటన్ విజేత సికింద్రాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆర్పీఎఫ్ ఇంటర్ డివిజనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 45 ప్లస్ విభాగంలో పురుషుల సింగిల్స్, డబుల్స్ టైటిళ్లను సికింద్రాబాద్ డివిజన్ కైవసం చేసుకుంది. ఈనెల 26వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లోని మల్టీపర్పస్ రైల్వే స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. దక్షిణమధ్య రైల్వే ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆరోమసింగ్, విజేతలకు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పీఎన్‌ఆర్‌హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. పీఎన్‌ఆర్‌హిల్స్, ఆర్టీసీకాలనీ, హెచ్‌ఎంటీ స్వర్ణపురికాలనీలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంట వరకు కృషినగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు మియాపూర్, బాలాజీనగర్, అరబిందోకాలనీ, శ్రీరంగపురంకాలనీ, డీ-మార్ట్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

పేట్‌బషీరాబాద్: కొంపల్లి సబ్-స్టేషన్ పరిధిలోని అపర్ణ, స్టీల్‌సిటీ, కేవీ కేకే సొసైటీ, కేవీఐడీఏ-2, దూలపల్లి, డోలార్ ధని, జయభేరి, న్యూజీవీడ్, వెన్‌సాయి, కొంపల్లి ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వినాయక్‌రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బహదూర్‌పల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలో సర్వేనెంబరు 131లోని ప్రభుత్వ భూమిలో స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేసి ఇతరలకు అమ్మేశాడు. కొనుగోలు చేసిన వారు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల అండదండలతో భవనాలు నిర్మించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టీపీఓ సంజన, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన బాధితులు మాత్రం అయోమయంలో పడిపోయారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

● ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

సూరారంలోని సర్వేనెంబరు 49/6లో కబ్జాదారులు దాదాపు రూ.30 కోట్ల విలువ చేసే ఎకరం స్థలానికి ఫెన్సింగ్ వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అక్కడే ఉన్న ఓ సంస్థ సెక్యూరిటీ గార్డు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పాటు సంస్థ యాజమాన్యానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ఆ స్థలం వద్దకు వచ్చి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే పీడీ యాక్టు నమోదు చేయిస్తామని కబ్జాదారుడిని హెచ్చరించారు. దీంతో ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు నిర్మాణాలను నిలిపివేయించారు.

● పేట్‌బషీరాబాద్‌లో..

పేట్‌బషీరాబాద్: జీడిమెట్ల డివిజన్‌లోని సర్వేనెంబరు 25/1లో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. పేట్‌బషీరాబాద్‌లోని సర్వేనెంబరు 25/1లో కోర్టు వివాదంలో ఉన్న 160 గజాల స్థలంలో నిర్మాణం చేపడుతున్న సమాచారం అందుకున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆ నిర్మాణాన్ని కూల్చివేయించారు. వివాదంలో ఉన్న స్థలంలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛతీస్‌గఢ్‌కు చెందిన రమాదిపటేల్(30) బతుకుదెరువు కోసం నగర శివారులోని జీడిమెట్లలోని గ్రీన్‌పార్కులోని గణేష్ బిల్డర్స్ నిర్మాణం జరుగుతున్న భవనం వద్ద ఉంటున్న స్నేహితుడు వద్దకు పని కోసం గురువారం వచ్చాడు. సాయంత్రం స్నేహితుడితో మద్యం తాగి రాత్రి నిద్రపోయాడు. శుక్రవారం తెల్లవారే సరికి రమాదిపటేల్ లిఫ్ట్ గుంతలో పడి శవమై కనిపించాడు. స్నేహితులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు, భవన నిర్మాణ యజమానులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.